
కథ

# ధాంక్యూ...నందినీ!

- రమ్య

ఏ రోజైతే నా మెళ్లో మూడుముళ్లు వేసావో.. ఆరోజే నేను నీ సొంతమై పోయా. మరో ఆలోచనంటూ లేకుండా నా నూరేళ్ల సహచరుడిగా జీవితంలోకి సాదరంగా స్వాగతించా.. ప్రతి రాతిరి జాతరలో రతిరాణిలా నిన్ను అలరిస్తూ నన్ను నేను సంపూర్ణంగా అంకితం చేసా. తపనల తనువుని తనివి తీరా అర్పిస్తూ, మధురోహల మనసుని మనసా వాచా సమర్పించేసా... నాకంటూ ఏదీ లేకుండా సర్వం నీ పరం చేసేసా... అంతలా నిన్ను నే ఆరాధిస్తుంటే.. నాకు నువ్వేం చేశావ్?

-నందిని



కాలింగ్ బజ్జర్ మోగింది.


అంతరాత్రివేళ ఇంత చొరవగా గడపతొక్కే ధైర్యం ఇంకెవరికుంటుంది?

ఒక్క నా మొగుడికి తప్ప.

'ఆ మిడ్‌నైట్ గెస్ట్... నా ప్రియమైన హజ్బెండే...' బలవంతంగా నిద్రమత్తు వదిలించుకుంటూ తలుపు తీసేందుకు సమాయత్తమైంది.

టైం చూస్తే... రాత్రి రెండుగంటలు.

ఇంతలో మళ్లీ బెల్ మోగింది... ఆ ధ్వనిలో కిషోర్ అసహనం వ్యక్తమవుతోంది.



"ఇదిగో వస్తున్నా.." లోగొంతుతో నెమ్మదిగా అంటే బయటకు వినిపించదు. కాస్త గట్టిగా అరిస్తే కిషోర్‌కే కాదు... వాడవాడంతా వినిపించి ఉలిక్కిపడి లేస్తుంది. నైటీ సర్దుకుని గబగబా వెళ్లి తలుపు తీసింది నందిని.

"ఏమిటాలస్యం?" ప్రతిరోజూ నందిని అడగాలనుకునే ప్రశ్నే అది.

ఆనవాయితీగా ఈసారీ కిషోర్ అడిగేసాడు.

"లేడీస్ ఫస్ట్ అంటారుగానీ.. ఆలస్యంగా ఇంటికొచ్చే భర్తను కరువుతీరా నిలదీసే ఛాన్సు కూడా ఇవ్వని సమాజం మనది" లోలోన ఉడుక్కుంటూ లోనికి వెళ్లింది.

ఆమె అడుగుజాడలను కిషోర్ అనుసరించాడు.

హాల్లోకి వచ్చీరాగానే సోఫాలో అతను కూలబడ్డాడు.

భుజానకున్న కోటు తీసి ఓ వేపు విసిరేయడమే కాకుండా ఇంకోవేపు టైని విదిలించాడు.

తర్వాత నెమ్మదిగా బూట్లు విప్పి సాక్స్ తొలగిస్తున్నాడు.

అతను విసిరేసిన కోటును హ్యాంగర్‌కి తగిలిద్దామని అందుకుని.. ఆ వెంటనే షాక్ తిన్నట్లుగా అతని వంక చూసింది.

అదేం పట్టనట్లు కిషోర్ తనపనిలో తానున్నాడు.

"ఏమండీ... కిషోర్‌గారూ.." నందినికి కోపమొచ్చినపుడల్లా నాసికా పుటలు అదరడమే కాదు, పిలుపులో గౌరవం హెచ్చుతుంది. ఆ సంగతి పెళ్లయిన కొత్తలోనే కనిపెట్టేసాడు కిషోర్.

అందుకే, చటుక్కున తలెత్తి... అటెన్షన్‌గా ఫోజిస్తూ– "ఏమిటి?" అనడిగాడు.

"అబ్బ...! ఆ కంపెలా భరిస్తారండీ?" ముక్కు మూసుకుంటూ అడిగింది.

"గట్టిగా అనకే.. ఎవరైనా వింటే తాగుబోతనుకుంటారు"

"తాగుబోతు కాదు.. తిరుగుబోతు" మనసులో అనుకుంది నందిని.

"అభ ఛా.. నేనడిగేది మీ కోటుకు అంటుకున్న ఘాటైన సెంట్ గురించి.."

"ఓ... అదా!" నవ్వేసాడు.

"ఆ సెంటు సుందరి కలిసిందా?"

సెంట్ సుందరి అంటే నందిని దృష్టిలో రేష్మా.

ఆమె ఇలా వచ్చి అలా వెళ్లిందని ఎవరూ చెప్పక్కర్లేదు. ఆమె వచ్చి వెడితే చాలు.. పరిసరాలన్నీ పరిమళభరితమే. అతి ఖరీదైన పాయిజన్ సెంట్ ఆమె రాసుకుంటుంది. ఓ చుక్క రాసుకుంటే చాలు.. రోజు రోజంతా వెంటాడుతుందా సుగంధం.

"కలవకేం? నిక్షేపంలా కలిసింది. ఓ యాడ్ షెడ్యూల్ చేసింది. మరో షెడ్యూల్ రేపుంది..." చెప్పాడు.

"ఆహా... అలాగా... ఆవిడగారేనా మీ కోటుకింత సెంట్ పూసింది.... ఆవిడేమో మోడల్... నా మొగుడేమో ఆవిడ కొంగు పట్టుకుని తిరిగే యాడ్ ఫొటోగ్రాఫర్. భలే జంట"

"ఇంకా కొంగులెక్కడున్నాయి.. అన్నీ చున్నీలే..." నవ్వుతూ అన్నాడు కిషోర్.

కిషోర్ అలా మాట్లాడితే చాలు.. కలువల్లాంటి నందిని కళ్లు నీళ్లు నింపుకున్న కడవలే అవుతాయి. కోపంతో చామంతి చెక్కిళ్లు గులాబీలనే తలపిస్తాయి. నవ్వితే ఎంచక్కా జలజలా రాలిపడే మల్లెలు మటుమాయమవుతాయి. నందిని అలా అలిగినపుడల్లా ఆమె దగ్గరికి వచ్చి చుబుకాన్నెత్తి.. బలవంతంగా కళ్లలో కళ్లు పెట్టి అమాయకంగా చూస్తూ... "నిజం

చెప్పు... నీ మొగుడు అమ్మాయిల వెనుక పడి తిరిగేవాడా? ఏరికోరి నిన్ను ఇల్లాలిని చేసుకున్నాను కదే... ఈ అమాయకుడిని అంతలా అనుమానిస్తావా?'' అని బతిమాలడం కిషోర్‌కి ఎంతో ఇష్టం.

ఇపుడూ అదే జరిగింది.

కిషోర్ నందినిని గుండెలకు హత్తుకుని- ''పిచ్చిదానా... మొగుడు పెళ్లాల మధ్య అలకలు, ఆరోపణలు, చిరాకులు, పరాకులుండకూడదు. ప్రేమ ఉండాలి. ఎవరెన్ని నూరిపోసినా సడలని నమ్మకం ఉండాలి. నేను నిన్ను మోసం చేస్తే... నన్ను నేను మోసం చేసుకున్నట్లేగా..'' అన్నాడు.

అంతే! నందిని కరిగిపోయింది. అతనిపై ఒరిగిపోయింది.

క్షణం గడిచాక...''అయ్యో! నా మతిమండా... మీకు భోజనం వడ్డించలేదు... ఆకలేయడం లేదూ..'' అడిగింది అతని పొత్తికడుపుమీద చెయ్యి వేస్తూ.

''ఫ్రెండ్స్ బలవంతం చేస్తే బయటే తినేసాను. నువ్వు అన్నం తిన్నావా?'' ప్రేమగా అడిగాడు.

''పెళ్లయిన మర్నాడే మీరు చెప్పారుగా.. ఆకలెపుడైతే అపుడు అన్నం తినేయాలి తప్ప భర్త ఎపుడొస్తే అపుడు అన్నం తినాలనుకోకూడదని...''

''అవును నందూ..! బయటకెళ్లిన మగాడికి లక్ష పనులుంటాయి. వేళకి ఇంటికొచ్చి అన్నం తినేందుకు వీలుపడదుగా..'' అన్నాడు కిషోర్.

నందిని తలూపింది అంగీకారసూచకంగా.

భర్త ఇంటికి రాగానే అనుమానంగా చూడడం, సెంట్ వాసన పసికట్టడం, కోటుగుండీలకు చిక్కుకున్న పొడవాటి వెంట్రుక పట్టుకుని ఆరాలు తీయడం, అడపాదడపా అభాండాలు వేయడం... తీరా అతను దగ్గరకొచ్చి మాటాడగానే... చిరుగాలి తాకిన మేఘంలా కరిగి నీరైపోవడం పెళ్లయిందగ్గర్నుంచీ నందినికి అలవాటే.

అతను నచ్చచెప్పినపుడు ఊరుకున్న మనసు... అతను బయటకెళ్లగానే ఎదురు తిరుగుతుంది.

అనుమానపడుతుంది.

ఎందుకంటే.. ''మగాళ్లలో శ్రీరామచంద్రులెవరూ ఉండరే.. అందరూ గీతాచార్యులే. ఆనాడు కట్టుకున్న పదహారువేలమందిలో ఇంతకీ నువెవ్వరు? అని అడిగే శ్రీ కృష్ణులే..'' అని చెవిలో ఇల్లు కట్టుకుని మరీ నూరిపోసిన పెద్దక్కయ్య వనజ మాటలే మాటిమాటికి గుర్తొచ్చి కలత చెందుతుంటుంది.

అవును-వనజని కట్టుకున్న భర్తే మోసం చేసాడు. పెళ్లయిన రెండేళ్లకే రెండోకాపురం గుట్టు రట్టయ్యేసరికి కంటికీ మంటికీ ఏకధారగా ఏడ్చింది వనజ. ఇంకేం చేయలేక... మొగుడింటికి వచ్చిననాడు సంసారం చేసేది. లేనినాడు.. ఎక్కడున్నాడో తలచుకుని తలచుకుని కృంగిపోయేది. గవర్నమెంటాఫీసులో మామూలు క్లర్క్ పనిచేసే బావే అంత గ్రంథం నడిపాక.. అసలే అందగాడు, ఆపై యాడ్ ఫొటోగ్రాఫర్ అయిన తన మొగుడేం చేస్తాడోనని బెంబేలు పడుతుండేది నందిని.

''నువ్వెన్ని చెప్పినా నమ్మలేను...'' అని కిషోర్‌కి ముఖం మీద చెప్పలేకపోతోంది.

అలాగనీ... మిన్నకుండా ఉండలేదు.

పెళ్లయిన మర్నాటినుంచి నానా అవస్థలు పడుతోంది నందిని.

పది నిముషాల తర్వాత-

బాగా అలసిపోయాడేమో... పక్కమీద వాలిన వెంటనే నిద్రలోకి జారుకున్నాడు కిషోర్.

ఇక, నందినికి నిద్ర పట్టనే లేదు.

బెడ్‌లైట్ కాంతిలో పక్కకు ఒరిగి పడుకున్న భర్తనే రెప్పార్చకుండా చూస్తూ ఆలోచిస్తోంది.

''బయటెక్కడో పూటుగా లాగించొచ్చాడు. ఇంట్లో అన్నం తినలేదు. అయిదు నక్షత్రాల పూటకూళ్ళు అడుగడుగునా ఉన్నాయి. కాబట్టి, ఆకలేసి లాగించేసాడనుకుంటే.. సర్దుకోవచ్చు. అయితే... ఆ ఆకలి సంగతేంటి?'' నందినిని తొలుస్తున్న ప్రశ్న అదే.

దాంతో, బుర్ర వేడెక్కి పోతోంది.

కొత్తగా పెళ్లయిన కుర్రాళ్లు ఏకాంతం ఎపుడెపుడా అని అంగలార్చుతుంటారు.

ఆషాఢాల అడ్డంకులకు దేవదాసులే అవుతారు.

కాపురానికొచ్చిన తొలినాళ్లలో అమ్మానాన్నలపై బెంగపడ్డ భార్యని పుట్టింటికి పంపేందుకూ 'ససేమిరా..!' అంటారు.

అటువంటి లక్షణాలేవీ కిషోర్‌లో కనిపించ లేదు.

అంతెందుకు? శోభనంనాడూ అంతే!

''పెళ్లయిన వెంటనే జరిగే తొలిరాత్రిలో మగాడి దూకుడు నిభాయించడం కష్టం... కంగారు పడకుండా కాస్త నిభాయించుకోవాలే...'' అంటూ హితైషులెందరో హితవు పలికారు.

'పాతికేళ్ల బ్రహ్మచర్యాన్ని ఒక్కసారి వదిలేస్తున్న ఆనందంలో మగాడు రెచ్చిపోతాడనీ... కట్టలు తెంచుకున్న వరద ప్రవాహంలా ముంచెత్తుతాడ'ంటూ భయపెట్టారు మరికొంతమంది.

ఆడదానికి కూడా తొలి బెరుకుంటుందని... దాంతో ఇబ్బందులు వస్తాయని ఇంకొంతమంది హెచ్చరించారు.

అంతేనా... సినిమా సిలబస్ లోని ఫస్ట్‌నైట్ సీన్లలో కూడా ఇంచుమించు ఇదే తరహా మెసెజ్‌లుండడాన్ని గమనించింది నందిని.

దాంతో కిషోర్‌తో ఆ రాత్రి శోభనమనగానే కించిత్ భయానికి లోనైంది.

అయితే, అందుకు భిన్నంగా తంతు జరిగిపోయింది.

ఆరాత్రి కిషోర్ ఆవురావురమని మీద పడిపోలేదు.

ఆబగా తాకనూ లేదు.

హాయిగా కబుర్లు చెప్పాడు.

తీరిగ్గా చిన్ననాటి విశేషాలు చెప్పాడు.

అయిదో క్లాసులో ఏరుదాటి స్కూల్‌కి వెళ్లడం దగ్గర్నుంచీ, కాలువల్లో కాగితం పడవలు వదలడం దాకా, చెరువులో దిగి తామరలు కోసుకుని కోవెల్లో దేవతకు ఇవ్వడం దగ్గర్నుంచీ, ఆరో తరగతిలో ఆడస్నేహితురాలు జడకుచ్చులు లాగి ఏడిపించడం దాకా కథలు కథలుగా చెప్పి నవ్వించాడు.

ఆ తర్వాత మూడోరోజుకి అయ్యగారికి మూడొచ్చింది.

తుఫానులా ఆక్రమించాడు.

సునామీలా పరాక్రమించాడు.

గాలికూడా దూరకుండా బిగియారా కౌగిలించుకున్నాడు.

ముఖంమీద ముఖం పెట్టి ముద్దులతో ముద్రలేస్తుంటే వెచ్చని అతని ఊపిరి వేణువులూదడం తనకు అనుభవైకవేద్యమే.

అందుకే... ఆ ఏకాంత రాత్రి తనను తాను నైవేద్యంగా సమర్పించుకుంది నందిని.

రాత్రంతా సరాగాలతో తేలియాడించి... ఆఖరికి అలసిసొలసి ఏ తెల్లవారుజామునో అతను వదలిపెట్టాక.. సరిగ్గా అపుడే ఆమెకో డౌటు కలిగింది.

అనుమానం నివృత్తి చేసుకోకపోతే ఉండలేని పరిస్థితి ఎదురయ్యాక... నెమ్మదిగా అతనిదగ్గరకు చేరి, చాతిపై తలానించి- ''ఏమండీ! ఓ మాట అడగాలనుంది... ఏమనుకోరుగా...'' అంది.

''అడుగు నందూ... సందేహమేలా... బాలా?'' నాటకీయ ఫక్కీలో అన్నాడు కిషోర్.

''ఏమీ అనుకోరుగా...''


''ఏమీ అనుకోను...'' హామీ ఇచ్చాడు.

''మొదటి రెండ్రోజులూ అలా ఉన్నారెందుకండీ?''

''ఎలా..?''

''దూరం దూరంగా.. కబుర్లు చెప్తూనే కాలక్షేపం చేసారుగా.. అలా''

ఓ క్షణం మాట్లాడలేదు కిషోర్.



తర్వాత నెమ్మదిగా అన్నాడు- ''ఒకరికొకరం కొత్తేగా... అలవాటవడానికి ఆ రెండ్రోజులు పట్టింది. అంతే!''

అయితే, ఆ తర్వాత అలా ఎందుకడిగానా? అని నందిని ఎంతో మధనపడింది.

ఓ రెండ్రోజులు తాళలేకపోయానని తన గురించి అపార్థం చేసుకుంటాడేమోనని కలవరపడింది.

అదృష్టవశాత్తూ అలాటిదేం జరుగలేదు.

అదంతా గుర్తొచ్చింది నందినికి.

ఒక్క ఆరోజే కాదు... ఆ తర్వాత చాలాసార్లు కిషోర్ బిహేవియర్ అందరి మగాళ్లకన్నా కాస్త భిన్నంగానే

ఉండేది.

దగ్గరుంటే ఎంత కేర్ తీసుకుంటాడో... దూరంగా ఉంటే అంత కేర్‌లెస్‌గా ఉంటాడేమోననే అనుమానం కలిగేలా అతని ప్రవర్తన ఉంటుండేది.

తన అవసరం అసలు లేదనేలా అతను వ్యవహరిస్తుంటే మంటెక్కేది. తొలి ఆషాడంలో ట్రెడిషన్ కొద్దీ పుట్టింటికి వస్తే... సెల్ పలకరింపులే తప్ప... కలుసుకోవాలన్న ఆత్రుత వ్యక్తపరచలేదేనాడూ కిషోర్. అలాగనీ.. అంటీముట్టకుండా వ్యవహరించకుండా అత్తింటివాళ్ల యోగక్షేమాలన్నీ ఆత్మీయంగా అడిగేవాడు.

అందుబాటులో ఉంటే అదే సెల్‌నుంచీ అందరితో కలివిడిగా మాట్లాడేవాడు.

'ఆరోగ్యం జాగ్రత్త...!' అంటూ హెచ్చరించేవాడు.

ఒక్కసారైనా కిషోర్ ఆషాడ విరహాన్ని బయట పెడతాడనుకుంది.

''నందూ.. నిన్ను చూడాలనుంది. ఒక్కసారి రానా?'' అని అడగలేదు.

అతను వస్తే హాయిగా కలుసుకునే ఆ ఏర్పాట్లేవో తానే చేసేదిగా.

కానీ... అతను అలా చేయలేదేనాడూ.

సరిగ్గా ... అపుడే, తన స్నేహితురాలన్నమాటలు చెవుల్లో గింగుర్లు తిరిగాయి నందినికి.

''ఈ మగాళ్లని నమ్మకూడదే నందినీ. పెళ్లి పెటాకులు లేకుండా బలాదూర్‌గా తిరగాలనే చూస్తారెపుడూ. పెళ్లంటే వాళ్ల విచ్చలవిడితనానికి ప్రతిబంధకం. అయినా... నిక్షేపంలా బయట పాలు దొరుకుతుండగా.. పాలకోసం ఆవును కొని పెరట్లో కట్టేసుకోవడమంత మూర్ఖత్వం ఉందా?''

ఆ మాటలకు అర్థం నెమ్మ నెమ్మదిగా తెలిసొస్తోంది నందినికి.

కిషోర్ వేపు చూసింది.

అమాయకంగా నిద్రపోతున్నాడు.

అయితే, ఆయనగారి ముఖంలో నందినికి దొంగ పిల్లి కనిపిస్తోంది.

అలాగే తేరిపారా చూస్తుంటే.. నల్లని మీసాలకు తెల్లని పాలంటుకున్నట్టనిపించి నవ్వుకుంది నందిని.

వెంటనే... ఆమెకు పరిమళ గుర్తొచ్చింది.

పరిమళ ఎలియాస్ రేష్మా.

స్కిన్ టైట్‌జీన్స్, లూజ్ టాప్స్‌తో ప్రొవోకింగ్ స్ట్రక్చర్‌ని అందంగా పాక్ చేసిన అపరంజి.

హస్కీ వాయిస్‌తో హాయ్ చెప్తూ, విస్కీ చూపుల్తో చురుక్కు మనిపిస్తూ, సొగసుసోయగాల వయసుని హోర్డింగ్‌లపై సుతారం ఆరేసే డేరింగ్, డేషింగ్ మోడల్. హైద్రాబాద్‌లో ఇపుడిపుడే ర్యాంప్‌పై కాట్‌వాక్ చేస్తూ మోడలింగ్ ఫీల్డ్‌లోనే సెన్సేషన్ క్రియేట్ చేస్తోందీ ట్వింకిల్ ట్వింకిల్ స్టార్. హైహీల్స్ టకటకలాడిస్తూ ఆమె నడిస్తే అదిరేటి మగ గుండెలెన్నో? ప్రొడక్ట్‌లు ప్రమోట్ చేస్తూ ఆమె చిన్న స్మయిలిస్తే షాపు కొచ్చిన కస్టమర్ల కష్టాలూ లెక్కలేనన్నే. దాంతో, ఆమె రికమెండ్ చేసిన ప్రొడక్ట్‌ల సేల్‌గ్రాఫ్ స్కయ్‌ని తాకుతుంది. లైఫ్‌నీ, హెయిర్‌ని కేర్‌లెస్‌గా వదిలేయడం ఆమెకే బాగా తెలుసు. పగటిని కూడా రాత్రిగా మార్చేయగల సత్తా ఆమె కురులకే ఉందంటారు చాలామంది. కలర్‌ఫుల్‌గా కాస్ట్యూమ్స్ వేయడమే కాదు... సోయగాల వళ్ళునే రంగుల హరివిల్లుగా మార్చేసు కోవడమూ ఆమెకు తెలుసు.

టాటూస్‌తో ఆమె రవివర్మ చిత్రాలనే తలపిస్తుంటుంది. ఆమె ఒక్క లుక్కిచ్చి అలా వెళ్లిందంటే చాలు.. గుండెల్లో తుఫానే.

శరీరాన్ని కలవరపరిచే సునామీయే.

చాలామంది అంటున్నట్లు కిషోర్‌కి రేష్మాకి నడుమ ఆఫ్ స్క్రీన్ కెమిస్ట్రీ ఏమైనా ఉందా?

ఖచ్చితంగా కనిపెట్టాలి.

గట్టి నిర్ణయానికొచ్చేసింది నందిని.

ఓ రోజు–

సాయంత్రం అయిదయేసరికే కిషోర్ ఇంటికొచ్చేసాడు.

అతని వెనుకే కాట్‌వాక్ చేస్తూ రేష్మా. అలా ఇద్దరినీ చూస్తూ వన్ మినిట్ నిశ్చేష్ట అయింది నందిని.

ఇద్దరూ పక్కపక్కన నిలుచుంటే 'మేడ్ ఫర్ ఈచ్ అదర్'లా తనకే అనిపిస్తున్నారనిపించింది నందినికి.

చిన్నపాటి అసూయ.

కిషోర్ దగ్గరకొచ్చి– ''ఇంటికొచ్చిన అతిథులను ఆనర్ చేయడం లేదా మేడమ్..'' అన్నాడు.

వెంటనే సర్దుకుని కిచెన్‌లోకి వెళ్లి కొన్ని స్వీట్లు ప్లేట్లో వేసి, ఫ్రిజ్ లోని కూల్ వాటర్‌ని గ్లాసుల్లో పోసి.. వాటిని ట్రేలో ఉంచి తీసుకొచ్చి టీపాయ్ మీద పెట్టింది నందిని.

ఈలోపల ఇల్లంతా చుట్టివచ్చేసిందేమో రేష్మా...

''హాయ్... కిషోర్! నీ హౌస్ వెరీ నైస్. స్పెషల్లీ నీ బెడ్ రూం నాకు మరీ నచ్చేసింది. వెన్నెలారబోసినట్లు దుప్పటి, దిళ్ళూ.. మాంఛి మూడ్ వచ్చేలా... గదిగోడలనలంకరించిన నిలువెత్తు ఫొటోగ్రాఫ్‌లు... మొత్తానికి యాడ్ ఫొటోగ్రాఫర్‌వనిపించుకున్నావ్...' అంటోంది.

ఆ తర్వాత నందినివేపు తిరిగి.... ''ఇంత టేస్టున్న కిషోర్‌ని భర్తగా పొందడం నిజంగా మీ లక్కీ...'' అని పొగిడింది.

వచ్చిన పదినిముషాల్లోనే ఆమె నందినితో కలిసిపోయింది.

ఎపుడు ఏకవచనంలోకి దిగిపోయిందో తెలియనీయకుండా మెస్మరైజ్ చేసింది.

కొన్నాళ్ల తర్వాత నందిని, రేష్మా గుడ్ ఫ్రెండ్సయిపోయారు.

కిషోర్ లేనపుడూ, కాస్త తీరిక చిక్కితే రేష్మా నందిని దగ్గరకొచ్చేస్తుంది. ఏ పర్మిషన్ లేకుండా నేరుగా కిచెన్‌లోకి వెళ్లి ఇష్టమైన పదార్థాలు ప్లేటు నిండుగా పెట్టుకుని తినేస్తుంది.

''ప్రొఫెషన్‌లో ఎదగాలనే కాంక్ష తప్ప మరో ఆలోచనే లేని ఈ అమ్మాయినా... తాను అనుమానించింది'' ఎన్నోసార్లు నందిని బాధపడింది.

అదే విషయం కిషోర్‌కి ఓసారి చెప్పగా అతనూ నవ్వేసాడు.

ఆ తర్వాత నెమ్మదిగా అన్నాడు– ''చూడు నందినీ... నీకు నీ భర్తపై విపరీతమైన ప్రేమ ఉంది. ఆ ప్రేమ అనుమానంగా రూపాంతరం చెందుతోంది. ముఖ్యంగా రేష్మాతో నాకున్న ప్రొఫెషనల్ ఫ్రెండ్‌షిప్‌ని అర్థం చేసుకోకుండా నీలో నువ్వే కుమిలిపోతున్నావ్. నేనది గ్రహించాను. నిజానికి... పెళ్లి చూపుల నాడే నన్నెంతగానో నువ్వు ఆకట్టుకున్నావ్. నీ మొగుడు పక్కచూపులు చూసేంత బలహీనుడు కాదని నీకు పదేపదే చెప్పాలనిపించింది. కానీ, చెప్పలేకపోయాను. సడన్‌గా ఎందుకో ... రేష్మా నిన్ను చూస్తానంటే ఇంటికి తీసుకొచ్చాను. మీ ఇద్దరూ మంచి ఫ్రెండ్సయ్యారు. ఇపుడు నాకన్నా నీకే రేష్మా గుడ్ ఫ్రెండ్. ఔనా...!''

''అవునండీ... '' అంది నందిని.

''వేదమంత్రాల సాక్షిగా ఒకటైన దంపతుల నడుమ ఉండాల్సింది అనుమానం కాదు... నమ్మకం. ప్రగాఢ నమ్మకం. చుట్టూ అందగత్తెలెందరున్నా, మిస్ యూనివర్స్‌లు, మిస్ వరల్డ్‌లు...మధ్య తన భర్త ఉన్నా కాస్తయినా చలించడనీ భార్య అనుకోవాలి. అలాగే కండలవీరులెందరున్నా తన భార్య మనసుపడదని భర్త అనుకోవాలి. ఆ నమ్మకమే పునాదైన వివాహం రసప్రవాహం. కాకుంటే... ఎద దహించే కల్లోలం. అదృష్టవశాత్తూ.. నా భార్య నన్నర్థం చేసుకుంది. థాంక్యూ నందినీ...'' అన్నాడు కిషోర్. ఇపుడు ఒకరిచేతుల్లో మరొకరి చేతులు అనురాగ బంధానికి ప్రతీకగా అల్లుకున్నాయి. ఈ బంధం వీడదీయరానిదని చెప్పకనే చెబుతున్నాయి.

అంతే!

*

## అత్తగా శ్రీదేవి?

సుమారు మూడు దశాబ్దాల పాటు టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్‌లను ఏలిన అందాల తార శ్రీదేవి వివాహం అనంతరం నటనకి దూరంగా ఉంది. తిరిగి నటించాలన్న ఆలోచన శ్రీదేవికి ఇటీవలే వచ్చింది. తిరిగి తమిళ చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేయనుంది. ధనుష్, హన్సిక నటిస్తున్న ఈ చిత్రంలో హన్సిక తల్లిగా, ధనుష్‌కు అత్తగా శ్రీదేవి నటిస్తుందని తెలిసింది. పొగరుమోతు అత్త పాత్రలో శ్రీదేవి తన అభిమానులకు కనువిందు చేయనుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. అక్టోబర్ నెలాఖరులో ఈ చిత్రాన్ని ప్రారంభించి, ఏప్రిల్ నెలలో పూర్తిచేయాలని దర్శక నిర్మాతలు భావిస్తున్నారు. అయితే, శ్రీదేవి డేట్స్ ఖాయం కాగానే చిత్ర నిర్మాణం ప్రారంభమవుతుందని వారు తెలిపారు.

